ఇసుక సంక్షోభం..!

- ఇసుక కృత్రిమ కొరతతో బ్లాకులో అమ్మకాలు
- పనుల్లేక, పథకాల్లేక కూలీల పస్తులు
- ఆందోళన బాటలో రోడ్డెక్కుతున్న కార్మికులు

ఏ పూటకు ఆ పూట రెక్కాడితే గాని డొక్కాడని భవన నిర్మాణ కార్మికులు ఇసుక సంక్షోభంతో కుదేలవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక పథకాన్ని ప్రవేశపెడతామని నాయకులు హామీలిచ్చారు. ఇప్పుడేమో ఇసుకే బంగారంలా నిర్మాణ రంగానికి అందని ద్రాక్షగా చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


గుడ్లవల్లేరులో ఇసుక కొరతతో ప్లింత్ భీముల్లోనే నిలిచిన పనులు


గుడ్లవల్లేరులో ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్)

గుడ్లవల్లేరు: ఇసుక కృత్రిమ కొరత చూపించి బ్లాకులో అమ్మకాలను దొడ్డి దారిన సాగిస్తున్న కూటమి నాయకుల కారణంగా పనుల్లేక పోవటంతో పస్తులు ఉంటున్న కూలీల కుటుంబాల కడుపులు తరుక్కుపోతున్నాయి. వారాలు తరబడి వేచి ఉన్నా పని లేకుండా పోతుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అందుబాటులో ఉండే ఇసుక ఇప్పుడు ఎందుకు అందుబాటులో లేదనేది సమాధానం లేని ప్రశ్నగా మారింది. కూటమి నాయకుల హామీల్లో ఉచిత ఇసుక కూడా ఉంది. ఆ ఉచిత ఇసుక ఇవ్వకపోగా.. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రజల కోసం నిల్వ ఉంచిన ఇసుకను కూటమి నాయకులు అధికారంలోకి రాగానే గంటల వ్యవధిలోనే దొడ్డి దారిన తరలించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్ సీపీ హయాంలో సులభంగా దొరికే ఇసుకను ప్రస్తుతం అధిక ధరలకు బ్లాకులో కొనలేక నిర్మాణాలు నిలిచిపోతున్నాయి.

కార్మికుల ఆందోళన బాట

ప్రతి నెలా ఏదో ఒక సంక్షేమ పథకం పేరుతో వైఎస్సార్ సీపీ హయాంలో తమ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవని కార్మికులు చెబుతున్నారు. అలాంటి పథకాలు కూటమి ప్రభుత్వంలో లేకపోవటంతో పనుల్లేక.. పథకాల్లేక పస్తులు ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుకకు ప్రభుత్వం కృత్రిమ కొరత ఏర్పరచటంతో భవన నిర్మాణ కార్మికులతో పాటు కార్పెంటరీ, ప్లంబింగ్ వంటి వివిధ రకాల నిర్మాణ సంబంధ కార్మికులు సైతం ప్రభుత్వంపై అన్ని చోట్లా ఆందోళన బాట పడుతున్నారు.

వారం రోజులుగా పనుల్లేవు



వారం రోజులుగా పనుల్లేవు. నేను పని నేర్చుకున్న నాటి నుంచి ఈ రోజు వరకు ఇసుక లేక వారం రోజులుగా పనులు ఆగిపోవటం ఎప్పుడూ చూడలేదు. ఇసుక టన్ను వచ్చేసరికి రూ.1,700 తీసుకోవటంతో నిర్మాణ పనులు నిలిచిపోతున్నాయి. ఇసుక కొరత వలన నా వద్ద ఉన్న 30 మంది కూలీల్లో చాలామందికి పని దొరకటం లేదు.

– చొప్పవరపు రాంబాబు, తాపీ మేస్త్రి, గుడ్లవల్లేరు

కూలీలకు పనుల్లేక పస్తులు



భవన నిర్మాణ రంగంలో కూలీల కుటుంబాలు ఎన్నో ఎలాంటి పనుల్లేక పస్తులు ఉంటున్నాయి. కేవలం ఇసుక కృత్రిమ కొరత వలన ఈ దుస్థితి ఏర్పడింది. తాపీ పని చేత వచ్చిన కార్మికులు వేరే పని చేయలేరు. ఇసుకతో మాత్రమే భవన నిర్మాణం సాధ్యమవుతుంది. ఇసుకతో నిర్మాణం చేస్తేనే మరొక 26 రకాల పని వారికి పనులు ఉంటాయి.

– మహ్మద్ బాజీ, తాపీ మేస్త్రి, దోకిపర్రు, గుడ్లవల్లేరు మండలం

ఆందోళన తప్పదు



ఉచిత ఇసుకను ప్రజలకు అందిస్తామని గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఇపుడు చేతులెత్తేసింది. బ్లాకులో ఇసుక అమ్ముతున్నారు. భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేకుండా పోయాయి. ఇసుక కొరత తీర్చాలంటూ అన్ని చోట్లా మా పార్టీ తరపున ఆందోళనలు చేపడుతున్నాం. ఉచితంగా ఇసుకను వెంటనే అందించకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తాం.

– బసవ వెంకట శ్రీనివాసరరావు, సీపీఎం నాయకుడు

క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: అంతర్‌జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించినట్లు ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ బుధవారం తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన గన్నవరంలో జరిగిన ఈ పోటీలో 53 కిలోల విభాగంలో బి. అభిషేక్, 90 కిలోల విభాగంలో ఎన్.సుహాస్ (బంగారు), 66 కిలోల విభాగంలో పి. కార్తీక్ (కాంస్య), 59 కిలోల విభాగంలో పిజేవీ దుర్గాప్రసాద్ (కాంస్య) , 66 కిలోల విభాగంలో ఎ. జాన్ వెస్లీ (కాంస్య), 83 కిలోల విభాగంలో సీహెచ్ ప్రవీణ్‌లు (కాంస్య) పతకాలు సాధించారన్నారు. స్ట్రాంగ్ మ్యాన్‌గా ఎన్. దుర్గాప్రసాద్ ఎంపికయ్యారన్నారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులు, పీడీ వీర్ల గోపిని కళాశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ పాల్గొన్నారు.

పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలి



తోట్లవల్లూరు: పంటలకు పురుగు మందుల వినియోగాన్ని రైతులు తగ్గించాలని డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎస్. మనోహర్‌రావు సూచించారు. మండలంలోని భద్రిరాజుపాలెం, చాగంటిపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. మినుము పైరును మనోహర్‌రావు పరిశీలించటంతోపాటు రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. డీడీఏ జ్యోతిరమణి పురుగు మందుల యాజమాన్యం, ఎరువుల యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. పామర్రు ఏడీఏ స్వర్ణలత, డీఆర్‌సీ ఏఓ పద్మజ, మండల వ్యవసాయాధికారి జి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సప్లై కాలువ గట్టు ఆక్రమణల మయం



పామర్రు: స్థానిక సప్లై కాలువ పులేరు నుంచి బందరు కాలువకు మధ్యలో ఏర్పాటు చేశారు. ఈ కాలువ గట్టును కొందరు ఆక్రమించుకుని నివాస గృహాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో పుల్లేరు నుంచి బందరు కాలువకు నీటి సరఫరా సక్రమంగా జరగక పోవడం వలన అనేకమంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగింపు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బదిలీపై వెళ్లిన సెక్రటరీలు రికార్డులు అప్పగించాలి

కైకలూరు: ఉద్యోగ బదిలీపై వెళ్లిన సెక్రటరీలు నూతనంగా చేరిన సెక్రటరీలకు రికార్డులు అప్పగించాలని ఎంపీడీఓ ఫణీంద్ర పేర్కొన్నారు. డిజిటల్ అసిస్టెంట్లతో మండల పరిషత్ సమావేశ హాల్లో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధానంగా జలజీవన్ మిషన్ ద్వారా ఉచిత కుళాయి పొందిన కుటుంబాలు కుళాయి పన్ను చెల్లించడంలో అపోహలు పడుతున్నారన్నారు. వీరు పంచాయతీకి స్వల్ప పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనంతరం సచివాలయం–4లో రికార్డులు తనిఖీ చేశారు. కైకలూరు పంచాయతీలో డ్రెయిన్ల సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ పాఠశాల–1లో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. స్వర్గీయ అరికెపూడి శివహర్ష స్మారకార్థం తండ్రి ఏఆర్‌కే చౌదరి ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని లయన్స్ చైర్మన్ శశికళ తెలిపారు. లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, క్లబ్ కార్యదర్శి ఎం.పెరుమాళ్లు, కోశాధికారి కల్యాణపు నవాబు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన



కైకలూరు: విద్యార్థి దశ నుంచి ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కైకలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి పేర్కొన్నారు. కొల్లేటికోట బీసీ బాలుర వసతి గృహాన్ని బుధవారం తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థులకు మండల లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం వంటశాల, తాగునీరు, గదులు, భోజన ముడి సరుకులు, హాస్టల్ రికార్డులను పరిశీలించారు. హాస్టల్ పై గదుల రిపేర్లు, మరుగుదొడ్ల సమస్యలపై సిబ్బంది జడ్జికి వివరించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సురేష్‌బాబు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

గుడివాడరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని లింగవరం అడ్డరోడ్డు సమీపంలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదన్నారు. అలా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

ముదినేపల్లి రూరల్: మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సింగరాయపాలెంలో బుధవారం నిర్వహించారు. పార్టీ నాయకుడు మేడిమి చిట్టిబాబు ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

కబడ్డీ జట్లకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన మొవ్వ విద్యార్థులు


ఎంపికైన కోసూరు విద్యార్థులు

మొవ్వ: ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జగయ్యపేటలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల్లో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో మొవ్వ మండల విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారు. మొవ్వలోని శ్రీ మండవ కనకయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇంగువ ప్రవీణ్ కుమార్ (అండర్–14), శొంఠి యోగేశ్వర్(అండర్–17) జిల్లా జట్టుకు ఎంపికయ్యారని ఆ పాఠశాల పీడీ అప్పికట్ల రామారావు తెలిపారు. అలాగే కోసూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన చొటుపల్లి నమ్రత, బొగెం ప్రభుకుమార్ అండర్–14 విభాగాల్లో ఎంపికైనట్లు పీడీ చందు తెలిపారు. ఈ క్రీడాకారులను కోసూరు పాఠశాల హెచ్ఎం బి.నాగమణి, మొవ్వ ఇన్‌చార్జి హెచ్ఎం పసుపులేటి శివ కోటేశ్వరరావు అభినందించారు. ఈ క్రీడాకారులు త్వరలో అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగే అండర్–17 పోటీల్లో, బాపట్ల జిల్లా పిట్లవానిపాలెంలో జరిగే అండర్–14 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనన్నట్లు పీడీలు తెలిపారు.

నూతన ఆవిష్కరణలతో జియో నిరంతర అభివృద్ధి

గుడ్లవల్లేరు: నూతన ఆవిష్కరణలతో తమ జియో సంస్థ నిరంతర అభివృద్ధి చెందుతుందని చెన్నై టెక్నికల్ కన్సలెంట్ ఇంజినీర్ అనిరుధన్ ఐ.వి అన్నారు. శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో గుంటూరు చాప్టర్, కాలేజీ ఇ.జి.ఎస్. స్టూడెంట్ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో సివిల్ విభాగం పర్యవేక్షణలో ఫేసింగ్ చాలెంజెస్ టెక్నాలాజికల్ కేస్ స్టడీ అనే అంశంపై బుధవారం కార్యక్రమాన్ని చేపట్టారు. కళాశాల వ్యవస్థాపకుడు వల్లూరుపల్లి వెంకటరామ శేషాద్రిరావు స్మారకోపాన్యాసం చేశారు. జియో అభివృద్ధి చెందుతున్నప్పటికీ అనేక సవాళ్లను నిత్యం ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అందుకు కొన్ని విభిన్న స్థితులను అధ్యయనం చేయటం జరుగుతుందన్నారు. జియోకు ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విశ్లేషణాత్మకంగా పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా విశదీకరించారు. తద్వారా అధ్యాపకులు, విద్యార్థులకు వారి వారి స్థాయిలో సాంకేతిక అనుభవం, సమస్యా సాధన నైపుణ్యాల ఆవశ్యకతను విపులంగా తెలియజేశారు. కళాశాల సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, డైరెక్టర్లు అధ్యాపకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

పెదముద్దాలి(పామర్రు): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని పెదముద్దాలి గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు సీసీ రోడ్లకు బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని రకాల వసతులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బందెల జెర్సీ శాంతకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు కాకొల్లు రాజ్యలక్ష్మి, పీఆర్ ఏఈఈ రామారావు, నాయకులు వల్లూరిపల్లి గణేష్, కె.ప్రవీణ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.


పెదముద్దాలిలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

పోలీసు ఓపెన్ హౌస్‌కు విశేష స్పందన


వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఎస్ఐ రామచంద్రరావు


తోట్లవల్లూరులో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అర్జునరాజు

కలిదిండి(కైకలూరు): విద్యార్థులూ.. మీకు ఎఫ్ఐఆర్ అంటే తెలుసా? అని కలిదిండి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులను ఎస్ఐ వెంకటేశ్వరరావు అడిగారు. పిల్లలు ఠక్కున ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు అని చెప్పారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు బుధవారానికి మూడో రోజుకు చేరాయి. నియోజకవర్గంలో పోలీసు స్టేషన్ల పరిధి పాఠశాలలు, కాలేజీల్లో సైబర్ క్రైంపై వ్యాసరచన పోటీలు, ఓపెన్ హౌస్‌లు నిర్వహించారు. పోలీసు స్టేషన్‌లో కేసుల నమోదు, ఆయుధాల పనితీరుపై అవగాహన కల్పించారు. ఎస్ఐలు వెంకటేశ్వరరావు, రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: స్థానిక పోలీస్‌స్టేషన్లో బుధవారం ఓపెన్‌హౌస్ జరిగింది. వల్లూరుపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులకు ఎస్ఐ అర్జునరాజు స్టేషన్ కార్యకలాపాలు, ఆయుధాల వినియోగంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వీర్రాజు, పాఠశాల హెచ్ఎం స్వరాజ్యలక్ష్మి, పీడీ మణి పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కేవీ గోపాలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ తనిఖీ అధికారుల సమక్షంలో ఉదయం 10 గంటలకు లెక్కింపు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

దోమల నివారణకు చర్యలు

గుడివాడ టౌన్: పట్టణంలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఫాగింగ్ కార్యక్రమం చేపట్టామన్నారు. డ్రెయిన్లలో ఉన్న దోమల నివారణకు ఈ విధానం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలు సైతం మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుని పురపాలక సంఘానికి సహకరించాలని ఆయన కోరారు.

ఆలయంలో పలు అంశాలకు వేలం

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పలు అంశాలకు సంబంధించి వేలం పాట బుధవారం నిర్వహించారు. గుడివాడ డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ పరిశీలకుడిగా పాల్గొన్నారు. పాదరక్షలు భద్రపరచుకునేందుకు ఒక సంవత్సరానికి గాను వేలం నిర్వహించారు. అదేవిధంగా ఆలయానికి చెందిన ఈ కాంప్లెక్స్‌లో షాపులకు వేలం నిర్వహించారు. కొబ్బరి చెక్కలు పోగు చేసుకునేందుకు లైసెన్స్ పొందడానికి పాటదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు సహాయ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో సర్పంచ్ పెరుమాళ్ల పద్మ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభించారు. ఎంపీపీ స్కూల్ వద్ద నుంచి మంచినీటి చెరువు వరకు 220 మీటర్ల దూరం రూ.18 లక్షలతో నిర్మాణ పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. యూనిట్ ఇన్‌చార్జి రాంబాబు, సత్యనారాయణ, కృష్ణారావు, శ్యామ్, వెంకన్న పాల్గొన్నారు.

రీసర్వే గ్రామసభలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరు, ములకలపల్లి, ఈడేపల్లి గ్రామాల్లో రీసర్వే గ్రామసభలు బుధవారం నిర్వహించారు. ఈ సభల్లో తహసీల్దార్ సుభానీ రైతులతో మాట్లాడారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రామసభల్లో అర్జీల ద్వారా తెలియజేసుకోవాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. సభల్లో 59 అర్జీలు రైతుల నుంచి రెవెన్యూ అధికారులకు అందాయి. సర్వేయర్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి రాజ గోపురాల నిర్మాణం



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి రాజ గోపురాలను నిర్మిస్తున్నారు. ఆలయానికి నాలుగు వైపులా మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో ఈ నిర్మాణాలను చేపట్టారు. ఆలయ నిర్మాణం ఆరంభంలోనే ముఖ మండపం ఎదుట టీటీడీ దేవస్థానాన్ని పోలిన భారీ గాలి గోపురాన్ని దాతలు కృష్ణారెడ్డి, సుధారెడ్డి నిర్మించారు.

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ అనంతలక్ష్మి

గుడివాడరూరల్: వరి పంటలో తెగుళ్ల నివారణకు సకాలంలో రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ అనంతలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని శేరీవేల్పూరు, సిద్ధాంతం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పంట పొలాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. పంట ఈనె దశలో మానిపండు తెగులు పంటకు సోకే ప్రమాదం ఉందన్నారు. రైతులు తెగుళ్లను సకాలంలో గుర్తించి నివారణకు టిల్ట్ మందును పిచికారీ చేయాలన్నారు. రైతులకు మందు పిచికారీ విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో శేరీవేల్పూరు సర్పంచ్ ప్రభాకర్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

పెదపాలపర్రులో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏఓ బి.వేణుమాధవ్ రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ ధాన్యాన్ని విక్రయించుకునేందుకు ఇప్పటికే రైతులు స్థానిక రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందడానికి ఉపయోగించుకోవాలన్నారు.

అధిక యూరియా వాడకంతో దుష్ఫలితాలు

గుడ్లవల్లేరు: వరిలో అధిక యూరియా వాడకంతో దుష్ఫలితాలు ఏర్పడతాయని ఏఓ ఎల్.సునీల్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం వడ్లమన్నాడులో రైతులకు ఆయన అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. యూరియా అధిక వాడకంతో దోమపోటు అధికమవుతుందన్నారు. వెటర్నరీ వైద్యాధికారి వీణ, జనసేన మండల అధ్యక్షుడు పెన్నేరు రమేష్, స్వామి పాల్గొన్నారు.

అపరాల సాగులో మెలకువలు పాటించాలి

మండవల్లి: రబీ సాగులో వేయబోయే అపరాల సాగులో మెలకువల పాటించాలని ఏడీఏ జి.వెంకటమణి పేర్కొన్నారు. పెరికెగూడెం, అయ్యవారి రుద్రవరం గ్రామాల్లో రైతులకు మెలకువలను వివరించారు. మండలంలోని పెరికెగూడెం, అయ్యవారి రుద్రవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలోని స్కీముల గురించి రైతులకు తెలియజేశారు. ఏఓ షేక్ జరీనా మాట్లాడుతూ ప్రతి మంగళవారం, బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల అధికారులు రైతులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా రైతులకు వీబీఎన్–8 అనే మినుము మినీ కిట్లు రైతులకు అందజేశారు. సర్పంచ్ పెరుమాళ్ల పద్మ, ఎన్డీఏ నాయకులు రాంబాబు, వెంకన్న, వీఏఏలు గోపాల్, చాప్లిన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఫిషరీస్ అసిస్టెంట్లు, వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కూటమి పాలన పూర్తిగా విఫలం

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్నీడు బాబ్జి

పామర్రు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు పూర్తయినా సూపర్–6 పథకాలు అమలు చేయటంలో పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్నీడు బాబ్జి అన్నారు. స్థానిక శివరామకాంప్లెక్సులో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన బాబ్జి మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలనే లక్ష్యంగా పార్టీ నాయకులు అందరూ కలిసి పనిచేయాలన్నారు. రానున్న కాలంలో ప్రజల పక్షాన పోరాటాలను కాంగ్రెస్ పార్టీ చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొల్ల కృష్ణ, పామర్రు నియోజకవర్గ సమన్వయకర్త మొవ్వ మోహన్‌రావు, నాయకులు బాణావత్ భుజంగ నాయక్, కాగిత సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.